క్లుప్తంగా

పశువులకు గర్భకోశ చికిత్సలు



నీలకంఠరాజపురంలో పశువులకు చికిత్స అందిస్తున్న వైద్యాధికారి గాయత్రి

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురంలో శనివారం నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరంలో పశువైద్యాధికారి గాయత్రి ఆధ్వర్యంలో సిబ్బంది పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పశువులు ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దూడకు వెంటనే ముర్రుపాలు పట్టాలని సూచించారు. అలాగే వర్షాకాలంలో పశువులు, జీవాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా తప్పనిసరి



బీమా వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న గుర్ల డీసీసీబీ మేనేజర్ హరి కేశవ్

గుర్ల: ఖాతాదారులందరూ బీమా చేయించుకోవాలని స్థానిక డీసీసీబీ మేనేజర్ హరికేశవ్ సూచించారు. మండలంలోని గోషాడలో బీమా వల్ల కలిగే లాభాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి బీమా సురక్ష పథకంలో చేరడం వల్ల కుటుంబ పెద్దకు ప్రమాదం సంభవించి మరణిస్తే కుటుంబా సభ్యులకు బీమా లభిస్తుందని చెప్పారు. డీసీసీబీలో రైతులకు అవసరమైన రుణాలు సకాలంలో అందిస్తామని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో స్థానిక నేతలు రౌతు సత్యనారాయణ, గూడెం సొసైటీ సిబ్బంది శీర స్వామి, ఉన్నారు.

మ్యుటేషన్‌పై విచారణ



జమ్ము సచివాలయంలో మ్యూటేషన్లపై విచారణ చేపడుతున్న గరివిడి ఆర్ఐ అచ్యుతరావు

గుర్ల: గరివిడి మండలం తోంద్రంగి రెవెన్యూ పరిధిలో మ్యూటేషన్లు తిరస్కరించడంపై జమ్ము రైతులు ఇటీవల కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గరివిడి ఆర్ఐ అచ్యుతరావు జమ్ము సచివాలయంలో శనివారం విచారణ చేపట్టారు. చింతపల్లి సూరిసత్యం మూడుసార్లు మ్యూటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నా, రెవెన్యూ అధికారులు వాటిని తిరస్కరించారు. అదే గ్రామంలో 22 సర్వే నంబర్లకు ఎటువంటి ఆధారాల్లేకుండానే మ్యుటేషన్ ఆమోదించారని విచారణలో రైతులు తెలిపారు. విచారణలో సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి , రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



ఆటోడ్రైవర్ల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ షణ్ముఖరావు

కొత్తవలస: స్కూల్ పిల్లలను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సీఐ షణ్ముఖరావు అన్నారు. మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో ఆటోడ్రైవర్‌లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించకుండా, నెమ్మదిగా ప్రయాణం చేయాలని సూచించారు. తప్పనిసరిగా యూనిఫారం ధరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ మల్ల రాము, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

• ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నామని చెప్పారు. అనంతరం వెలుగు కార్యాలయం ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే లలితకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, వ్యవసాయశాఖ అధికారులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలే వారి అజెండా..

• మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



మెట్టపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: అబద్ధపు హామీలిచ్చి వాటిని అమలు చేయకపోవడం టీడీపీ నాయకులకు అలవాటేనని.. ఈ సారి చంద్రబాబుకు జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ తోడయ్యాడని మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ ఆరోపించారు. మండలంలోని మెట్టపల్లి, అలజంగి గ్రామాల్లో శనివారం రాత్రి 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి బెల్లాన ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఎన్నికల సమయంలో తప్పుడు హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యేనని ఎద్దేవా చేశారు. అన్యాయం జరిగితే ప్రశ్నిస్తాను.. అంటూ ప్రజల్లోకి వచ్చిన డిప్యూటీ సీఎం ఎక్కడున్నారో తెలియడం లేదన్నారు. ఏడాది కాలంలో ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. గ్రామాల్లోకి వచ్చే కూటమి నాయకులను హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తూ నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన త్రినాథరావు, దన్నాన జనార్దనరావు, ఎంవీఎస్ఎన్.రాజు, చందక గురునాయుడు, మీసాల ఈశ్వరరావు, కర్రోతు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్న మండల నాయకులు

• కళ్లబొల్లి మాటలకు మోసపోయారు..



రేగుబిల్లిలో కూటమి ప్రభుత్వం మోసాలను వివరిస్తున్న నరసింహమూర్తి, జైహిందకుమార్, తదితరులు

గంట్యాడ: కూటమి నేతల కళ్లబొల్లి మాటలకు ప్రజలు మోసపోయారని జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహామూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. మండలంలోని రేగుబిల్లి, పొల్లంకి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ.. చంద్రబాబుకు మించిన మోసగాడు లేడన్నారు. హామీలు అమలు చేయలేని నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, మండల ఉపాధ్యక్షుడు వర్రి మల్లయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి జాగరపు సత్యారావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు కె. విజయ్, ఉపాధ్యక్షుడు పాటుపురెడ్డి వెంకటరావు, పార్టీ నాయకులు కోరుపోలు కృష్ణమూర్తి, తదతరులు పాల్గొన్నారు.

• నిలదీయండి..



కొత్తవలసలో పాల్గొన్న ఎంపీపీ చలం నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు

బొండపల్లి: మండలంలోని కొత్తవలస, కొత్తపాలెం, మరువాడ గ్రామాలలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాలను ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు మహంతి రమణ, కర్రోతు మాధవ్, దాసరి శివప్రసాద్, వేమలి వెంకటరావు, పల్లి రఘు , సాలపు పెంటంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

• బాబు చెప్పేవన్నీ అబద్ధాలే..

గజపతినగరం రూరల్: చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో చెప్పినవన్నీ అబద్ధాలేనని జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు అన్నారు. మండలంలోని ఎం.వెంకటాపురంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, కె.పైడపు నాయుడు, బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో జరిగిన కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

• కూటమి పాలనంతా మోసమే..



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న పొట్నూరు సన్యాసినాయుడు, శీర అప్పలనాయుడు, తదితరులు

గుర్ల: కూటమి ప్రభుత్వ పాలనంతా మోసమేనని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు ఆరోపించారు. మండలంలోని గుజ్జింగివలస జరిగిన కార్యక్రమంలో కూటమి మోసాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు, కెంగువ మధుసూదనరావు, బోళ్ల సుబ్రహ్మణ్యం, రెడ్డి అప్పలనర్సయ్య, అట్టాడ అప్పలరాజు, రెడ్డి మురళీధరరావు, తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితులకు అండగా ఉంటాం

• సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని



జిందాల్ నిర్వాసితులతో కలిసి ఆందోళన చేస్తున్న తమ్మినేని

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితుల పోరాటానికి అండగా ఉంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హామీ ఇచ్చారు. బొడ్డవరలోని జిందాల్ నిర్వాసితుల పోరాట శిబిరాన్ని వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి గాడి అప్పారావుతో కలిసి శనివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. భవిష్యత్ కోసం భూములిచ్చి.. నేడు ఆదుకోవాలంటూ 44 రోజులుగా నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిర్వాసితుల మీదే పోలీసులచే కేసులు పెట్టించడం సిగ్గుచేటన్నారు. భూములిచ్చిన రైతులను కూలీలుగా మార్చి, వారి భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తామంటే ఊరుకోమన్నారు. చంద్రబాబు సర్కారు గత అనుభవాలను మరిచిపోయి వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజా, కార్మిక, వ్యవసాయ సంఘాలను కూడగట్టి ఎర్రజెండా నీడన జిందాల్ ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. జిందాల్‌కు మద్దతుగా టీడీపీ నాయకులు డబ్బులిచ్చి నడిపిన ఉద్యమం మూడు రోజులకే మూతపడిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, తదితరులు హాజరయ్యారు.

సమాచార హక్కు చట్టంతో ప్రయోజనాలు



విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ

చీపురుపల్లి: సమాచార హక్కు చట్టంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, ప్రతి ఒక్కరూ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ కృష్ణాజీ అన్నారు. సమాచార హక్కు చట్టం ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్‌సెంటర్ (ఎన్ఆర్‌సీ) నేతృత్వంలో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై వ్యాసరచన, వక్తృత్వ, ముఖాముఖి, క్విజ్, తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ద్వారా ఎలాంటి సమాచారాన్నైనా దాచి పెట్టేందుకు ఆస్కారం లేదన్నారు. కోరిన సమాచారాన్ని నిర్దేశిత రోజుల్లో ఇవ్వాల్సిందేనని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌సి కోఆర్డినేటర్ ఎ.చంద్రమౌళి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోండి



రోగిని పరీక్షిస్తున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

జామి: గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రోగులు వినియోగించుకోవాలని డీఎంహెచ్ఓ ఎస్. జీవనరాణి అన్నారు. తాండ్రంగిలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనుగుణ వ్యాధులపై ప్రజలందరు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.నాగశ్వేత, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఎన్.అనిల్‌ప్రేమ్‌కుమార్, హెచ్‌వీ భవానీ, తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌బాబుపై దాడి అమానుషం

గంట్యాడ: గుంటూరు జిల్లా వేమూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబుపై పోలీసులు దాడి చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. రామవరంలోని ఆయన నివాసంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారం కోసం ధర్నా చేస్తున్న దళిత నాయకుడిని పోలీసులు బలవంతంగా ఈడ్చేయడం దుర్మార్గమన్నారు. కూటమి పాలనలో దళితులు, మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

స్మార్ట్ మీటర్లను ఎలా సమర్థిస్తావు బాబూ..

• సీపీఎం నాయకులు



విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిస్తున్న సీపీఎం నేతలు

శృంగవరపుకోట: నాడు అధికారం లేనప్పుడు స్మార్ట్ మీటర్లు పగులగొట్టండి.. స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు వచ్చిన వాళ్లను తరిమికొట్టండి అని చెప్పిన చంద్రబాబునాయుడు నేడు స్మార్ట్ మీటర్లను ఎలా ఏర్పాటు చేస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రశ్నించారు. ఈమేరకు శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీపీఎం అనుబంధ సంఘాల నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలకు ఇప్పుడిప్పుడే చంద్రబాబు కుట్ర అర్థం అవుతోందన్నారు. మీటర్ల ఏర్పాటుకు ఎవరు వచ్చినా మీరు చెప్పినట్లే తరిమికొడతామని చెప్పారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈనెల 5న రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి గాడి అప్పారావు, సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటను పంచాయతీగా మార్చాలి



ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో సమావేశంలో పాల్గొన్న సభ్యులు

శృంగవరపుకోట: ఎస్.కోట మేజర్ పంచాయతీలో ఉన్న సీతంపేట శివారు గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా పరిగణిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయాలని సీతంపేట గ్రామస్తులు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో, ఎస్.కోట పంచాయతీ పాలకవర్గ సమావేశంలో వివరించారు. ఈ నేపథ్యంలో ఈఓ అనురాధ నేతృత్వంలో సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతంపేట గ్రామస్థుల అభ్యంతరాలను, అభ్యర్థనలను ఈఓ వినిపించారు. దీంతో సమావేశానికి హాజరైన సర్పంచ్ సంతోషికుమారి, వైస్ సర్పంచ్ మోపాడ కుమార్ సహా 16 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా సీతంపేటను పంచాయతీగా ప్రకటించాలన్న తీర్మానాన్ని ఆమోదించారు. దీంతో సభ్యుల తీర్మానాన్ని జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని ఈఓ చెప్పారు.

• తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి..



వేపాడ: దబ్బిరాజుపేటలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఆరోగ్యసిబ్బంది ఎంఎల్‌హెచ్‌పీ, తదితరులు



జామి: అలమండలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి



దత్తిరాజేరు: ఎం లింగాలవలసలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఇందిరాభవాని

పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తగించాలని ఐసీడీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, తద్వారా బిడ్డ ఎదుగుదలకు ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం వాడవాడలా అవగాహన సదస్సులు నిర్వహించి, తల్లిపాల విశిష్టతను వివరించారు. అలాగే గర్భిణులు ఆకు కూరలు, పప్పు దినుసులు ఎక్కువగా తీసుకోవాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



గంట్యాడ: మదనాపురంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఉమాభారతి



చీపురుపల్లి రూరల్ : గరివిడి మండలం నడిపేనపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం

• వితరణ..



ఎస్.కోటలోని శాఖా గ్రంథాలయానికి పట్టణానికి చెందిన మోపాడ శేషు ఇంటర్మీడియట్, జేఈఈ మెయిన్స్ పుస్తకాలను శనివారం వితరణగా అందజేశారు. పుస్తకాలను విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ డి. శ్రీధర్ సూచించారు.

– శృంగవరపుకోట

పశువుల వ్యాన్ సీజ్

దత్తిరాజేరు: మండలంలోని ఎస్. భూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం తనిఖీలు చేస్తుండగా పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టుబడడంతో సీజ్ చేసినట్లు ఎస్సై జి. రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనుమతు ల్లేకుండా పశువులను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.